క్లుప్తంగా

వేంకటేశ్వరునికి పూజలు



జగన్నాథపురంలో వేంకటేశ్వర స్వామివారికి శ్రీపుష్పయాగం చేస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి స్వామివారికి శ్రీపుష్పయాగం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు పొందూరు రంగాచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై తిరువీధిలో ఊరేగించారు. భక్తులు వివిధ రకాల పండ్లు, స్వీట్లు, పువ్వులు సమర్పించారు. పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రతి దరఖాస్తుకూ నాణ్యమైన పరిష్కారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రమేష్

కాకినాడ: ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తుకూ నాణ్యమైన పరిష్కారం అందిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ తెలిపారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్థిక, న్యాయపరమైన అంశాలు మినహా మిగిలిన ప్రతి సమస్యకు సత్వర పరిష్కారాన్ని అందిస్తామన్నారు. కార్పొరేషన్ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పబ్బినీడి మృతికి సంతాపం



పబ్బినీడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కురసాల సత్యనారాయణ, కళ్యాణకృష్ణ

కరప: గురజనాపల్లి మాజీ సర్పంచ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పబ్బినీడి సత్యనారాయణ మృతికి రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. సోమవారం గురజనాపల్లి వెళ్లి పబ్బినీడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు పబ్బినీడి పాపారావు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. సినీ దర్శకుడు కురసాల కళ్యాణకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు బాలాజీ, కె.చక్రధర్, మట్టా ప్రసాద్, మామిడాల చంటిబాబు, జనసేన నాయకుడు దేవు మధువీరేష్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కేంద్ర విధానాలపై ధర్నా



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాకినాడ: స్థానిక ఎల్ఐసీ ప్రధాన కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను నిరసిస్తూ సోమవారం కాంగ్రెస్ శ్రేణులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి నులుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ అసమర్థ నిర్ణయాలతో దేశం తిరోగమనంలోకి వెళ్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలతో సామాన్యుల జీవన ప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, పీసీసీ సభ్యుడు ఆకుల వెంకటరమణ, అధికార ప్రతినిధి నేమాం పెదబాబు, సమన్వయ కమిటీ సభ్యుడు తుమ్మలపల్లి వాసు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బి.వెంకటేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నిరసన

కాకినాడ సిటీ: పేదలకు ఇచ్చే ఇళ్ల నిర్మాణ సొమ్ము పెంచాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ధర్నా చౌక్ వద్ద నిరసన తెలిపారు. సీపీఐ నాయకులు కామిరెడ్డి బోడకొండ, తోకల ప్రసాద్, జి.లోవరత్నం మాట్లాడుతూ పేదల ఇళ్లకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం కలిపి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తున్నాయని, దానిని రూ. 5 లక్షలకు పెంచాలని అన్నారు. నాయకులు పెదిరెడ్ల సత్యనారాయణ, పీఎస్ నారాయణ, బొబ్బిలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్ని మతాలకూ సమ ప్రాధాన్యం



పిడుగులమ్మ వారి ఆలయంలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, తదితరులు

- ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నామని.. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలకు సంబంధించిన ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక 12వ డివిజన్ సంజయ్‌నగర్ ప్రాంతంలో రూ.35 లక్షలతో నిర్మిస్తున్న పిడుగులమ్మ తల్లి ఆలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పలువురు ప్రముఖులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవతగా పూజించే పురాతన పిడుగులమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కాకినాడలోని అన్ని కులాలకు సంబంధించిన ప్రార్థనా మందిరాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హిందువులకు సంబంధించి వేంకటేశ్వర ఆలయం, శివాలయంతో పాటు అనేక ఆలయాలను అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వం సమకూర్చిన రూ. కోటి నిధులతో పాటు తాను సొంతంగా మరో రూ. కోటి ఇచ్చి నగరంలోని చర్చిలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి వెల్లడించారు. అలాగే రెండు మసీదుల నిర్మాణం కూడా చేపట్టామన్నారు. ఇలా అన్ని మతాల సంప్రదాయాలను, భక్తి భావాన్ని పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్తున్నామని ద్వారంపూడి చెప్పారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద సుమారు 800 మందితో విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కరుణాకర రెడ్డి, కోనాడ దుర్గాప్రసాద్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో క్రీడాకారుల ప్రతిభ



విజేతలు చుండ్రు గోవిందరాజు, కృష్ణమూర్తిలకు పతకాలు అందిస్తున్న నిర్వాహకులు

నాగమల్లితోట జంక్షన్: కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈ నెల 2 నుంచి 5 వరకూ జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి హాజరైన క్రీడాకారులు పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. 75 ప్లస్ సింగిల్స్‌లో కర్రి భామిరెడ్డి, 45 ప్లస్ సింగిల్స్‌లో డి.సునీల్ కుమార్, 35 ప్లస్ సింగిల్స్ మహిళా విభాగంలో ఎం.సుభాషిణి, 75 ప్లస్ డబుల్స్‌లో కర్రి భామిరెడ్డి, వి.సోమరాజు, 70 ప్లస్ డబుల్స్‌లో చుండ్రు గోవిందరాజు, బి.కృష్ణమూర్తి, 45 ప్లస్ డబుల్స్‌లో పీఎస్‌వీ జగన్నాథ్, డి.సునీల్‌కుమార్ జట్టు విజేతలుగా నిలిచారు. 45 ప్లస్ సింగిల్స్‌లో పీఎస్‌వీ జగన్నాథ్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. కాకినాడ జిల్లా బ్యాడ్మింటన్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు మురళీధర్, కార్యదర్శి చుండ్రు గోవిందరాజు, డీఏఎన్ ప్రసాద్ వర్మలు సోమవారం కాకినాడలో జరిగిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



విజేతకు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న నిర్వాహకులు, పక్కన శిక్షకుడు లోవరాజు

కరప: కాకినాడలోని శుభం కాపు ఫంక్షన్ హాలులో రియాన్ ఆర్‌యూ షోటోకాన్ కరాటే ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ స్టేట్ కరాటే పోటీలలో నడకుదురు విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ కరాటే పోటీలు ఆదివారం జరగ్గా కలర్ బెల్ట్– కటా విభాగంలో (50– 55 కిలోలు) నడకుదురు విద్యార్థిని ముమ్మిడి సాయిరఘు ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతకు గోల్డ్‌మెడల్, ప్రశంసాపత్రాలను నిర్వాహకులు అందజేశారు. సాయిరఘు, శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టార్ యు.లోవరాజులను జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు పైలా రామతులసి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జవ్వాది సతీష్ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరునికి పుష్పోత్సవం



యండమూరు ఆలయంలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం చేస్తున్న అర్చకులు

కరప: యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పుష్పోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ వంశపారంపర్య అర్చకుడు పెద్దింటి సీతారామం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామోత్సవం జరిపారు. ఆలయ మండపంలో ఊయలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి స్వామి, అమ్మవార్ల విగ్రహాలను అందులో ఉంచి, తీపర్తి సత్యనారాయణ, సూర్యకుమారి దంపతులతో పూజాధికాలు చేశారు. పలు రకాల స్వీట్లను నైవేద్యంగా నివేదించి, స్వామివార్లకు పవళింపు సేవ నిర్వహించారు. యండమూరు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ ఈఓ పీవీఎస్ సూర్యనారాయణరాజు, కె.రఘు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మాఘ మాసం, స్వామివారికి ప్రీతైన సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జామున స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం నుంచి అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.

ఘనంగా దొడ్డి గంగమ్మ జాతర

పీబీ దేవం గ్రామంలోని మంచినీటి చెరువు గట్టుపై వేంచేసి ఉన్న దొడ్డి గంగమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన తోటకూర వంశస్తుల ఇలవేల్పుగా అమ్మవారిని కొలుస్తారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి వారంతా కలసి అమ్మవారి జాతరను నిర్వహిస్తారు. దీనిలో భాగంగా అమ్మవారికి పూజలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. జాతర ఉత్సవంలో చింతలూరు కళాకారుల గరగల నృత్యం, డప్పుల వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉర్స్ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

కొత్తపల్లి: బషీర్ బీబీ ఉర్స్ ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను ఎస్సై రామలింగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. పొన్నాడలో ఉన్న బషీర్ బీబీ(బంగారు పాప) దర్గాలో శుక్రవారం నుంచి ఆదివారం వరకూ జరగనున్న ఉర్స్ ఉత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో ఆదివారం జరిగే గంధోత్సవం ఎంతో కీలకమైందన్నారు. ఈ ఉత్సవాలకు కొత్తపల్లి, పిఠాపురం, పిఠాపురం రూరల్, గొల్లప్రోలు మండలాల నుంచి సుమారు 60 మంది సిబ్బందితో భారీగా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దర్గా వద్ద పోలీస్ కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ

- ప్రజలకు ఇబ్బందులు రానివ్వం
- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



కరపలో ఉప్పాలమ్మ తల్లి



ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య దంపతులతో చండీ యాగం చేయిస్తున్న ఆధ్యాత్మిక, శ్రీవిద్య ఉపాసకుడు లోకనాథ్‌శర్మ

కరప: సాగు, తాగునీటికి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు తెలిపారు. కరపలో పునర్నిర్మించిన ఉప్పాలమ్మ తల్లి ఆలయంలో సోమవారం ఆయన కుటుంబ సభ్యులతో కలసి చండీ యాగం చేయడానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. చింతపల్లి లాకుల పరిధిలోని కూరాడ, వాకాడ, వేములవాడ, కొంగోడు, యండమూరు, పెద్దాపురప్పాడు గ్రామాల్లోని పంట పొలాలకు సాగునీరు ఎద్దడి ఏర్పడుతుందని, దానిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ కృత్తికా శుక్లాతో చర్చించామన్నారు. రైతుల ఇబ్బందులను గమనించి ఇప్పటి నుంచే వంతుల వారీ విధానం అమలు చేస్తామని వివరించారు. మార్చి నెలలో సాగునీటి సమస్య తలెత్తితే, డ్రెయిన్లలో అడ్డుకట్టలు వేయించి, ఆయిల్ ఇంజిన్లతో నీరు తోడించాల్సి ఉంటుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారని ఎమ్మెల్యే తెలిపారు. పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ)కు ఏలేరు వాటర్ సరఫరా చేయించేందుకు నిర్ణయించారన్నారు. సాగునీటి సరఫరాలో సమస్యలు లేకుండా ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, రోజూ కలెక్టర్ సమీక్షిస్తుంటారని ఆయన చెప్పారు. ఏప్రిల్ 15 నాటికి రబీ కోతలు పూర్తయ్యే అవకాశముందని, కాలువలు మూసివేసేలోపు మంచినీటి చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృత్తికా శుక్లాకు తెలియజేయగా, తగిన చర్యలు తీసుకుంటామన్నారన్నారు. సర్పంచులు సాదే ఆశాజ్యోతి, కమిడి మంగాదేవి, వాసంశెట్టి శ్రీనుబాబు, నాగిరెడ్డి ఏసుబాబు, వాసంశెట్టి రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల ప్రసాద్, అప్పనపల్లి పెద్ద, సాదే లోహిదాస్‌కుమార్, మద్దూరి భాస్కర్, కొత్త రవి, పైలా గోవిందు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీయాగం

స్థానిక గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి ఆలయం వద్ద చండీ యాగం వైభవంగా నిర్వహిస్తున్నట్లు విశాఖ శారదా పీఠం ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్ చాగంటి సూరిబాబు తెలిపారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులతో చండీ యాగాన్ని మూడు రోజులపాటు చేయిస్తున్నట్లు వివరించారు. విజయవాడకు చెందిన ఆధ్యాత్మిక, శ్రీవిద్య ఉపాసకుడు యాదులూరి లోకనాథ్‌శర్మ పర్యవేక్షణలో చాగంటి సూరిబాబు మరో 10 మంది అమ్మవారి ఉపాసకులు మంత్రోచ్ఛారణలతో ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య దంపతులు చండీయాగం చేశారు. రెండో రోజు మహావిద్య, మూడో రోజు పూర్ణాహుతి పూజలు జరుగనున్నాయి. ముందుగా ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య దంపతులు, కృష్ణవేణి, వీఆర్వోల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చాగంటి వెంకట్రావు, పార్టీ నాయకులు, సర్పంచులు ఉప్పాలమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు.

క్రమబద్ధీకరణ చేసుకోండి



కరప సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ నూకరాజు

కరప: ఆక్వా జోన్‌లో లేని చెరువుల సర్వే నంబర్లను క్రమబద్ధీకరించడానికి గ్రామసభలు నిర్వహించి, రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు ఎఫ్‌డీఓ (ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) ఆర్.నూకరాజు తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా జోన్ పరిధిలో లేకుండా చెరువులు సాగు చేస్తున్న భూముల సర్వే నంబర్లు చదివి వినిపించి, వాటిని క్రమబద్ధీకరించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని సూచనలు చేశారు. అనధికార చెరువుల భూములను ఆక్వా జోన్ పరిధిలోకి మార్పు చేయించుకునేందుకు ప్రభుత్వాదేశాల మేరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ కర్రె స్వప్న, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీఓ ఏవీ రాజేష్, ఉప సర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, కార్యదర్శి వి.సునీల్‌కుమార్, వీఆర్వో కె.సూర్యనారాయణరెడ్డి, వీఎఫ్ఏ వి.గాయత్రీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అరట్లకట్ట, జెడ్.భావారం, కొరిపల్లి, పెనుగుదురు, వేములవాడ, వేళంగి గ్రామాల్లో ఎఫ్‌డీఓ సభలు నిర్వహించారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

- నాలుగు రోజుల పాటు నిర్వహణ
- పది సచివాలయాల్లో ఏర్పాటు



కమిషనర్ రమేష్

కాకినాడ: ఆధార్‌లో మార్పులు, చేర్పుల కోసం మంగళవారం నుంచి శుక్రవారం వరకూ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఆధార్‌కు మొబైల్ నంబర్, మెయిల్ అడ్రస్ అనుసంధానం, బయోమెట్రిక్ (ఫొటో, ఐరిస్, వేలిముద్ర) అప్‌డేట్, పేరు, పుట్టిన తేదీల్లో, చిరునామాల్లో మార్పులు, ఆధార్ డౌన్‌లోడ్ చేసుకోవడం, కొత్తగా ఆధార్ నమోదు వంటి సేవలను ప్రత్యేక శిబిరాల్లో పొందవచ్చనని చెప్పారు. నగరంలో 1 నుంచి 5వ డివిజన్ వరకూ కృష్ణనగర్‌లోని 2ఏ సచివాలయంలో, ఆరు నుంచి 12వ డివిజన్ వరకూ డైరీఫారం సమీపంలో 11ఏ సచివాలయంలో, 14, 18, 19, 20 డివిజన్లకు గోళీలపేటలోని 14ఏ సచివాలయంలో ఆధార్ సేవలు ఉంటాయన్నారు. 15, 16, 17, 25, 26 డివిజన్లకు యానాం రోడ్డులోని 15ఏ సచివాలయంలో, 21 నుంచి 24 డివిజన్లకు చినమార్కెట్ సమీపంలోని 21ఏ సచివాలయంలో, 27 నుంచి 29 డివిజన్ల వరకూ యాళ్లవారివీధిలోని 28బీ సచివాలయంలో ఏర్పాట్లు చేశామన్నారు. 30, 35, 36, 37 డివిజన్లకు సంబంధించి జగన్నాథపురం సమీపంలోని 30బీ సచివాలయంలో, 13, 31, 32, 33, 34 డివిజన్లకు బ్యాంక్‌లోని 31ఏ సచివాలయంలో ఆధార్ సేవలు లభిస్తాయన్నారు. అలాగే 38 నుంచి 43వ డివిజన్ వరకూ గాంధీనగర్ 38బీ సచివాలయంలో, 44 నుంచి 50వ డివిజన్ వరకూ గైగోలుపాడు 50బీ సచివాలయంలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా సేవలకు సంబంధించి నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని కమిషనర్ రమేష్ స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



వేట్లపాలెంలో ఎరువుల దుకాణ గోదాములో నిల్వలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సామర్లకోట: రైతులకు సక్రమంగా ఎరువులు, పురుగు మందులు అందజేయాలనే లక్ష్యంతో కాకినాడ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక స్క్వాడ్ తనిఖీలు చేస్తున్నాయి. సోమవారం వేట్లపాలెం శ్రీసత్యసాయి ఏజెన్సీ, సామర్లకోటలోని శ్రావణి ఎరువులు పురుగు మందుల దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. ఏడీఏ స్వాతి మాట్లాడుతూ దుకాణాల్లో స్టాక్, రికార్డులను పరిశీలించామని తెలిపారు. అదే విధంగా రోజూ విక్రయాలతో పాటు స్టాక్ బోర్డులో నమోదు చేసే విధంగా ఉన్నది లేనిదీ తనిఖీ చేశామన్నారు. ఫెర్టిలైజర్స్ షాపుల యజమానులు సక్రమంగా షాపులను నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ తనిఖీల్లో ఏఓలు ఐ.సత్య, వెంకటలక్ష్మి, ఏఈఓ ఎంవీ సతీష్ పాల్గొన్నారు.

భజన పోటీల్లో విజేతలకు బహుమతులు



ప్రథమ బహుమతి అందుకున్న వేట్లపాలెం భజన మండలి

సామర్లకోట: వేట్లపాలెంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భజన పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా స్థాయిలో ద్రాక్షారామ భజన మండలి, మండల స్థాయిలో వేట్లపాలెం ప్రథమ స్థానాల్లో నిలిచారు. సోమవారం విజేతల వివరాలను ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో శ్రీఅయ్యప్ప భజన మండలి ప్రథమ విజేత కాగా రూ.మూడు వేలు, గండేపల్లి మండలం తాళ్లూరుకు చెందిన శ్రీలక్ష్మీశ్రీనివాసా భజన మండలికి రూ.రెండు వేల బహుమతి అందజేశామన్నారు. మండల స్థాయిలో విజేత శ్రీసీతారామ మహిళా భజన మండలికి రూ.రెండు వేలు, ద్వితీయ స్థానం పొందిన జి.కొత్తూరుకు చెందిన శ్రీరామదుర్గ భజన మండలికి రూ.వెయ్యి అందించామని తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా గుణ్ణం శారదాదేవి, అమలకంటి చంటిబాబు, పెండ్యాల నాగేశ్వరరావు మాస్టార్లు వ్యవహరించారు. స్వామివారి కల్యాణ ఉత్సవాలు, భజన పోటీలు విజయవంతంగా జరగడానికి సహకరించిన అందరికీ నాగేశ్వరరావు మాస్టారు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాన్‌పై బోల్తా పడిన లారీ



వ్యాన్‌పై బోల్తా పడిన బియ్యం లోడ్ లారీని పరిశీలిస్తున్న పోలీసులు

సామర్లకోట: ఆగి ఉన్న వ్యాన్‌పై బియ్యం లోడ్‌తో వెళుతున్న లారీ బోల్తా పడటంతో పెను ప్రమాదం తప్పింది. సామర్లకోటలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఐదు తూముల సమీపంలో విక్రయించే చేపలు కొనుగోలు చేసేందుకు వ్యాన్‌ను డ్రైవర్ మర్రి శ్రీనివాస్ ఆపాడు. ఈ నేపథ్యంలో పెద్దాపురం పట్టాభి ఆగ్రో రైస్ మిల్లు నుంచి బియ్యం లోడ్‌తో కాకినాడ పోర్టుకు వెళుతున్న లారీ అదుపుతప్పి వ్యాన్‌పై బోల్తా పడింది. దీంతో డ్రైవింగ్ సీటులో శ్రీనివాసు, వ్యాన్‌లో నిద్రపోతున్న అతని కుమారుడు మర్రి సత్యనాథం స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్, క్లీనర్ పరారయ్యారని ఎస్సై టి.సునీత తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

9, 10 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్

బాలాజీచెరువు: తపాలా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీలలో సుకన్య సమృద్ధి యోజన ఖాతాల ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కాకినాడ పోస్టల్ సూపరింటెండెంట్ దాసరి నాగేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. ఎవరైనా తమ అమ్మాయి వయసు 10 ఏళ్లలోపు ఉంటే ఖాతా ప్రారంభించవచ్చని, ప్రతి నెలా కనీసం రూ.250 నుంచి రూ.లక్షా యాభై వేల వరకూ పొదుపు చేయవచ్చన్నారు. ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వం 7.6 శాతం వడ్డీ ఇస్తుందని, 21 ఏళ్ల వయసు వచ్చే వరకూ స్కీమ్ అమలులో ఉంటుందన్నారు. 18 ఏళ్లు దాటిన తరువాత వివాహం లేదా ఉన్నత చదువుల కోసం 50 శాతం డ్రా చేయవచ్చని, 21 ఏళ్లు దాటిన తరువాత డిపాజిట్ వడ్డీతో సహా చెల్లిస్తుందన్నారు. ఇతర వివరాలకు సమీపంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

బజాజ్ ఫిన్‌సర్వ్‌తో 'ఆదిత్య' ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న కళాశాల ఏడీ నాయుడు, హెడ్ పల్లవి

బాలాజీచెరువు: పూణేకు చెందిన ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ బజాజ్ ఫిన్‌సర్వ్‌తో ఆదిత్య డిగ్రీ కళాశాల ఒప్పందం చేసుకుంది. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ తదితర వాటిపై విద్యార్థులకు మరింత విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఒప్పందం చేసుకున్నామని కళాశాల అకడమిక్ డైరెక్టర్ నాయుడు తెలిపారు. సోమవారం కళాశాల ఆవరణలో నాయుడు, బజాజ్ ఫిన్‌సర్వ్ సీఎస్ఆర్ హెడ్ పల్లవి ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా 100 గంటల పాటు శిక్షణ కార్యక్రమం బీబీఏ, బీకామ్ విద్యార్థులకు అందజేస్తారన్నారు. మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, పార్టనర్ రష్మీమన్సుఖానీలు పాల్గొన్నారు.

రేపు ఆధ్యాత్మిక సమావేశం

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళా మందిర్‌లో నిరంకారీ సంత్ సమాగం ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో 8వ తేదీ బుధవారం సాయంత్రం 5 గంటలకు ఆధ్యాత్మిక సమావేశం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో సద్గురు మాత సుదీక్షాజీ మహారాజ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారన్నారు. భక్తులంతా హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీల ధర్నా

కాకినాడ సిటీ: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులు చెల్లించాలంటూ జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ జెడ్పీ సెంటర్‌లో ధర్నా చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పేరుతో అన్నింటిపై పన్నులు వేస్తుందని విమర్శించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు దడాల పద్మ, జి.బేబీరాణి, చంద్రావతి, సీఐటీయూ నాయకులు చెక్కల రాజ్‌కుమార్, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతం

కాకినాడ సిటీ: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయవంతం అయ్యిందని ఆ పార్టీ కాకినాడ పార్లమెంట్ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 నుంచి చంద్రబాబు కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ పర్యటన ఉంటుందన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

బాలాజీచెరువు: ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని జనసేన పార్టీ నగర ఇన్‌చార్జి ముత్తా శశిధర్ అన్నారు. మన ప్రాంతం–మన సచివాలయంలో భాగంగా సోమవారం 16వ వార్డు–బి సచివాలయాన్ని సందర్శించారు. మద్దు విజయ్‌కుమార్, నాగమణి, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.